
**సాయంత్రం** ఆరింటి వేళ.

అంబేద్కర్ నగర్ అనబడే ఆ హరిజన వాడలో నున్న సుమారు ఏభై గుడిసెల్లో, పొయ్యి రాజేస్తున్న ప్రయత్నాల వల్ల గుడిసెల్లోంచి పొగ వాడపై మబ్బుల్లా పొలుము కొంటున్నాయి. గుడిసె గుడిసెకీ మధ్యన ఐదడుగుల స్థలంలో నగ్నంగా, అర్ధ నగ్నంగా ఉన్న పిల్లలు వాళ్ళు పుట్టినప్పటి నుంచీ వాళ్ళకున్న ఒకే ఆటవస్తువు — మట్టితో హాయిగా ఆడుకుంటున్నారు. ఆ వాడ మొత్తానికి




ఈ మధ్యే సర్కారువాళ్ళు. బస్తీలో వో మీటింగు పెట్టి ఇందిరా గాంధి పేదల కెంత సేవచేస్తున్నదో వో అరగంట సేపు లెక్చరిచ్చి వో రిగ్గుబావి త్రవ్వించారు. అప్పట్నించి రోజూ ఆ వాడలో ఉన్న ఆడవాళ్ళు —పిల్లలకీ అక్కడో అరగంట సేపు కీచులాటలు, కొట్లాటలూ.

దానమ్మ కడుపుకాల! ఆ రిగ్గులో ఎంతసేపు కొట్టినా వో కడివెడు నీళ్ళు కరువేనాయె! రోజు కో సారైనా ఒకరి సిగ లొకరు పట్టుకొని, ఎదుటి వారి కులగోత్రాలూ, పుట్టు పూర్వోత్తరాలూ మంచి పట్టున్న సంస్కృతంలో వల్లెవేసుకోవడం అక్కడ ఆడవాళ్ళకు అలవాటై పోయింది. ఇక పిల్లలేమో!

# ముళ్ళగులాబి

యస్. సీతారామారావు




ఒకళ్ళమీా దింకొక రుమ్ముకోవడం, అర్థం తెలియకున్నా, పెద్దవాళ్ళకే కాపీరైట్లున్న తిట్లని తిట్టుకోవటం, కుండలో కాసిని నీళ్ళు తీసుకుని గుడిసె కెళ్ళడం అలవాటే!

ఈ వాడలో దళారీకి ఏభై రూపాయలు కట్టి ఇరవై గజాల స్థలంలో గుడిసేసుకున్న సత్తికికూడా ఇదే— రోజూ ఉండే దిన చర్య.

గుడుంబా తాగుడుతో మొగుడు చచ్చింతర్వాత, ఉన్న ఏడేళ్ళ కూతురు లచ్చి, తనూ ఆ గుడిసెలో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. వాళ్ళకి కష్టం, సుఖం ఇవేవీ తెలీవు. ఆకలంటే తెలీదు. సత్తి వాడ ప్రక్కనున్న రెడ్డి గారింట్లో పాచిపనులు చేస్తుంది. వాళ్ళు నెలకి ముప్పై రూపాయలు ఇస్తారు. దొరసాని దయబట్టి నెలకో, రెంటికో వో పాతచీర ఇస్తే దాంతో ఒళ్ళు కప్పుకుని పని చూసుకుంటుంది సత్తి.

ఇక లచ్చికి — బట్టలు కట్టుకోవడమంటే తెలీదు. ఈ మధ్యనే సత్తి దానికో పాత నిక్కరు— దొరసాని వాళ్ళ అబ్బాయిది ఇస్తే వేసింది. అంత వరకూ లచ్చి పచ్చి దిగంబరే. ఈ మధ్యే వాళ్ళమ్మతో వో సారి దొరసాని వాళ్ళింటి కెళ్ళినప్పుడు అమ్మాయిల పూల పూల గౌన్లు, అబ్బాయిల తెల్లటి— ఎర్రటి అంగీలు చూసి—

"అమ్మా! నాగ్గూడా అసుంటి బట్ట లిప్పియ్యవే" అంది.

"అయ్యో! బాగున్నదే నీ యేసం. ను వ్వేమన్నా దొరల బిడ్డవా? అట్లడుగుతువ్. గౌన్లంటే ఎంత పైక మైతదో ఎర్కనా? పిచ్చిదాన్లెక్క మాట్లాడకు. మక్కె లిరగ దంత" అంటూ బెదిరించింది సత్తి. లచ్చి నోరు మూసుకుంది.

మొన్నామధ్యే యింటి ముందు కూర్చుని మట్టిలో ఆడుకుంటున్న లచ్చికి, వాళ్ళమ్మ ఒక చిరిగిన షర్టొక టిచ్చింది.

ఎంతో సంబరంతో ఆ చొక్కాని లచ్చి తొడుక్కుంది. దానికి మోకాళ్ళ దాక వచ్చింది ఆ చొక్కా. ఎంతో మురిసిపోతూ లచ్చి ఆ రోజంతా ఆ చొక్కా పై జేబుల్లో చేతులు పెట్టుకుని మురిసి పోయింది. మాటిమాటికీ లాగూకున్న జేబులో చేతులు పెట్టుకోవడం, చొక్కా జేబుల్లో చేతులు పెట్టుకోవడం, ఒక ఆటగా తయారయింది ఆ లచ్చికి.

"ఏందేవ్! అంత మురుస్తున్నావ్. ఏమన్న పెండ్లి పిల్లని జేసిర్నా నిన్ను? నడు నడు! ఇయ్యాల జరంత నా మాట యిను.

దొరసాని కొడుకు పెండ్లి. మాపటికి బరాత్తొస్తది. దాని ముంగ బస్తీల ఉన్న వయసు పోరగాళ్ళంత కొంచెం గుడుంబ కొట్టి డాన్స్ చేస్తరు. బాజ బజాయిస్త ఉంటే అయిదారు మంది పెండ్లి పిలగాడూ, పిల్ల కూసున్న బండి ముంగట ఎగుర్లాడ్తరు.

దొరసాని చెప్పింది మనిద్దర్ని రమ్మని. ముంగట ట్యూబ్‌లైట్లు పెట్టుకోనీకి కిరాయిల.

మూడు రూపాలు నాకు, రెండు నీకు యిస్తరు. జర పయిలంగ పట్టుకో ఆ టేబులైటు. పరాకత్తుగుంటివా టేబు కింద పడ్తది. దొరసాని నా బొక్క లిరగ్గొట్తది" అంటూ గుడిసెలో కెళ్ళింది.

లచ్చి కేమీా అర్థం కావడం లేదు. అయితే ఇప్పుడు అమ్మ వెంట వెళ్ళాలని మాత్రం అర్థమయింది. గుడిసెలో కెళ్ళి విరిగిపోయిన దువ్వెన ముక్కతో తల దువ్వుకుంది. కుండలోంచి కొన్ని నీళ్ళు చేతిలో పోసుకుని ముఖం కడుక్కుంది. అమ్మ కొంగు పట్టుకుని దొరసాని యింటికి బయల్దేరింది.

సత్తికెంత సంతోషం. ఇవాళ, రేపు దొరసాని వాళ్ళింట్లో పెళ్ళి భోజనం. ఈ పెళ్ళి వూరేగింపులో లైట్లు మోసినందుకు తనకీ, లచ్చికీ ఐదు రూపాయల సంపాదన. ఆ పైసలతో ఏం కొనాలో అప్పుడే సత్తి ఒక పంచవర్ష ప్రణాళికంత ప్లాను వేసుకుంది. ఎండాకాలం వస్తున్నది గాబట్టి ఇంకో కుండ కొనాలని, లచ్చి చేతులకి రెండేసి గాజులు వేయించాలని.

ఇద్దరూ బంగళా చేరుకున్నారు. వూరి చివర శివాలయం ప్రక్కనున్న ఆవరణలో పెళ్ళి.

చిన్నదొర కార్లో కూర్చున్నాడు. కారునంతా మల్లె పూలతో అలంకరించారు. చిన్నదొర క్రిష్ణారెడ్డి స్నేహితులంతా కారు చుట్టూ నిలబడ్డారు. క్రిష్ణారెడ్డి చెల్లెల్లు అందరి మీాదా పన్నీరు జల్లుతోంది. కారుముందు దాదాపు ఫర్లాంగు పొడుగునా మూడేసి అడుగుల ఎడంతో యిరువైపులా ట్యూబ్‌లైట్లు పట్టుకుని కూలీ జనం ఆ వేడుక నెంతో ఆశ్చర్యంగా చూస్తున్నారు.

బాజావాళ్ళు వాయిస్తు న్నారు — వో సినిమా పాట:

"బొంబాయిసే ఆయ మేరా దోస్త
దోస్త్‌కో సలామ్ కరో"

కారు ముందర వో నలుగురబ్బాయిలు ఆ పాటకి లయగాడుస్తూ డాన్స్ చేస్తున్నారు. మధ్యలో ఒక అబ్బాయి ప్రతి పది అడుగుల ప్రయాణానికీ ఆ పెళ్ళి వారి ప్రయాణాన్ని ఆపి, చేతిలో ఉన్న దివిటీ మీాద నోట్లో కిరసనాయిలు పోసుకుని దానిమీద ఉమ్మేటూ పెద్ద మంట తెప్పిస్తున్నాడు. అందరూ చప్పట్లు కొడ్తే ఏదో ఘనకార్యం చేసినట్టు అందరికీ కనుసైగ చేస్తున్నాడు.

ప్రక్కనే ట్యూబులైటు పట్టుకున్న సత్తి దాని ప్రక్కనే దాదాపు దానంతున్న ట్యూబులైటు ఎంతో జాగ్రత్తగా పట్టుకున్న లచ్చి, ఈ పెళ్ళి సందడిని ఎంతో ఆత్రంగా చూస్తున్నారు.

లచ్చికిమాత్రం ఇవేమీా అర్థం కావటం లేదు. దరిద్రంలో పుట్టి పెరుగుతున్న ఆ పసి హృదయం ఈ గొప్పవాళ్ళ ఆర్భాటాలేమీా అర్థం చేసుకునే పరిస్థితుల్లో లేదు.

జారిపోతున్న లాగూని ఒకచేత్తో పైకి లాగుతూ, ట్యూబులైటు క్రింద పడకుండా, ఎత్తి పట్టుకుని అందరితోపాటు మెల్లిగా ముందరి కడుగులేస్తోంది ఆ చిన్నారి లచ్చి.

క్రిష్ణారెడ్డిని వాళ్ళనాన్న ఈ మధ్య లక్ష రూపాయలు డొనేషను కట్టి ఇంజనీరింగులో సీటు సంపాయించేడు.

కొడుకు ఇంజనీరు అవటం మా టెలా ఉన్నా, తను పెట్టుబడి లక్ష రూపాయల్నీ అతి త్వరలో రాబట్టుకోవాలని తండ్రి సుబ్బారెడ్డి ప్లానే ఈ నాటి వేడుక— క్రిష్ణారెడ్డి పెళ్ళి.


రెండు లక్షల కట్నం వగైరా వగైరాలతో ఈ నాటి ఈ పెళ్ళి ...

పెళ్ళివారు శివాలయం ఆవరణ చేరడాని కింకెంతో ఆలస్యం లేదు.

కారు ముందర డాన్సు చేస్తున్న కుర్రాళ్ళు కూడా అలసిపోయేరు కామోసు — డాన్సు జోరు తగ్గించారు.

సత్తిమాత్రం ఆ ట్యూబులైటు నెంతో జాగ్రత్తగా పట్టుకుని, అప్పుడప్పుడు లచ్చి వంక చూస్తోంది. ఒక్కసారి సత్తి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగేయి. రెండు చేతుల్తో గట్టిగా ట్యూబులైటుని పట్టుకుని, లచ్చి ముఖం మీాద చమటని భుజాతో తుడుచుకుంటోంది.

ఇంక జరసేపు సయిను. గుడి దగ్గ రొచ్చింది. టేబు పదిలం ( పయిలం ) అంటూ లచ్చిని మంద




లించింది సత్తి.

ఇంట్లో ఇంత గంజి త్రాగి హాయిగా పడుకోవాల్సిన ఈ చిన్న వయసులో పాపం లచ్చి దాదాపు గంటనుండి రెండు చేతుల్తో ఆ ట్యూబులైటుని పట్టుకుని ఆ దొరగారి పెళ్ళి పందిడిలో ఎవ్వరి కళ్ళకీ కనబడటం లేదు.

ఎవరో బహుశా పెళ్ళికొడుకు మిత్రులై ఉంటారు — ఒక పెద్ద బుట్టెడు గులాబీలు తెచ్చి కార్లో కూర్చున్న పెళ్ళికొడుకు మీదేశారు. ఆ పూలు కొన్ని, అలా రోడ్డుమీద పడ్డాయి. ఒక పెద్ద ఎర్రగులాబీ వొచ్చి— లచ్చి మీదకూడా పడింది. లచ్చి ఉలిక్కిపడింది. చేతిలోని ట్యూబులైటు అలా ప్రక్కకి ఒంగింది. లచ్చి తమాయించుకుంది. ఈ లైటు క్రింద పడితే యింకేమైనా ఉందా? అమ్మ చంపేస్తుంది.

కానీ, ఆ గులాబీ పువ్వు చాలా బావుంది. లచ్చికి ఎంతో మనసయింది. మెల్లగా వంగింది—ఆ పువ్వు తీసుకుందామని—జాగ్రత్తగా వంగి పువ్వందుకోవాలని. ఒక చెయ్యి క్రింద పెట్టింది. పువ్వు చేతికందింది.

అంతే! ఇంకో చెయ్యి పట్టు తప్పింది! చేతిలో ఉన్న ట్యూబులైటు ఒక్కసారి క్రిందపడింది— పెద్ద చప్పుడుచేస్తూ.

లచ్చి కొక్కసారి కళ్ళు తిరిగాయి. వళ్ళంతా వణకడం మొదలుపెట్టింది. సత్తి చేతిలో ఉన్న లైటుని ప్రక్కవాళ్ళ కిచ్చి, లచ్చి దగ్గర కొచ్చి లాగి ఒక గుద్దు గుద్దింది లచ్చిని.

"లంజె! చెప్తనేఉన్న నీకు! లైటు పయిలంగ పట్టుకోవాలె అని— ఇప్పుడేం చెయ్యాల. దొరలు మన ప్రాణం తీస్తరు" అంటూ ఏడుస్తోంది!

క్షణంలో అందరూ వాళ్ళ చుట్టు ముట్టేరు.

పెళ్ళివారి వూరేగింపు ఆగిపోయింది. అందరి కళ్ళూ ఆ తల్లీ కూతుళ్ళ మీదే కేంద్రీకృతమైనాయ్. చుట్టూ చేరిన వాళ్ళు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.

"ఛీ ఛీ. తిండికి లేకపోయినా వీళ్ళు అజాగ్రత్త మాత్రం ఒదలరు. మనం జాలిపడటమే అనవసరం వాళ్ళ మీద" అంటున్నా డొకడు.

"తన్ని వసూలు చెయ్యండి ఆ ట్యూబు డబ్బు ఆ ముండ దగ్గర్నుంచి" అంటున్నా డింకొకడు.

"ఏమోనబ్బా — మన రెడ్డి పెళ్ళి వూరేగింపు ముందర యిలా జరగటం మంచి శకునం కాదు" అన్నా డింకొకడు

క్షణంలో వచ్చిం దక్కడికి దొరసాని కళ్ళెర్ర జేస్తూ.

సత్తి కళ్ళు బైర్లు కమ్మాయి.

లచ్చి భయంతో అమ కొంగు పట్టుకుని కూర్చుంది కువ్వకూలి.

"చిన్నపిల్ల చెయ్యి జారిందమ్మా..." ఇంకేదో మాట్లాడే లోపలే, దొరసాని చెయ్యి చేసుకుంది... సత్తిమీదే కాదు — లచ్చిమీద కూడా.

"అమ్మా" ... అది లచ్చి బాధతో. చుట్టూ ఉన్న వాళ్ళు ఒక కామందు తన్నేడు లచ్చిని కాలి బూట్ తో. ఒంకర్లు తిరిగిపోయింది లచ్చి బాధతో.

"అమ్మా నీకాళ్ళు పట్టుకుంటా తప్పయిందమ్మా నీబాంచను" అంది సత్తి క్రిందపడ్డ లచ్చిని పైకెత్తుతూ.

"ఈ పనిమనిషి ముండల మీద మనం దయ దలచడమే తప్పు. వాళ్ళ కడుపెప్పుడు నిండుతుందో అప్పుడే మొదలవుతుంది వీళ్ళతో కండకావరం."

"ఛీ! దొంగముండ. నీ ముఖం నాకు చూపొద్దు. ఇక్కడినుండి బయటకు నడు" అని ఎన్నో ఏళ్ళుగా వాళ్ళింట్లో విశ్వాసంగా పనిచేస్తున్న సత్తి జుట్టు పట్టుకుని, వూరేగింపు బయటకు నెట్టేసింది— దొరసాని.

ఆ వూపులో ఒక్కసారి సత్తి కారు పక్కకొచ్చి పడింది. వెంటనే లచ్చి కూడ మీద పడ్డది. ఆ వూపులో లాగూవూడి క్రింద పడింది. పైకెత్తి కట్టుకునే లోపే వెనకనించి ఎవరో ఒక త్రోపు త్రోసేరు ఆ చిన్నారిని. లాగూ కాళ్ళలో పడి, తూలి ముందర పడిపోయింది లచ్చి.

వూరేగింపు ముందుకు సాగిపోతోంది.

వూరేగింపు ముందు డాన్సు జోర్గా మొదలయింది మళ్ళా.

సత్తి, లచ్చీ ప్రక్కనే ఉండిపోయేరు. వూరేగింపు ముందరికి సాగిపోతోంది.

లచ్చి నోట్లోంచి నెత్తురుకారి అలా క్రింద పడ్డది.

లచ్చి క్రిందికి చూసింది. భూమ్మీద పడ్డ తన ఎర్రటి నెత్తురుని భయంతో కొంచెం దూరంలోనే తను కట్టుకున్న లాగూ జేబులోంచి గులాబి కనబడుతున్నది కొంచెం కొంచెం.

లచ్చి కోపంతో లేచి వెళ్ళి ఆ గులాబీలో ఉన్న గులాబిని పైకెత్తింది కోపంతో. చేత్తో నలిపేసింది కోపంతో. ఆ గులాబిని నేలకేసి కొట్టింది...

కార్లోంచి దిగాడు పెళ్ళికొడుకు. మెడ బరువుతో వంగింది. అరడజను పూల మాలల్ని మొయ్యలేక, తీసి ప్రక్కనున్న స్నేహితుడి కందించేడు పూల దండల్ని మెళ్ళోంచి తీస్తూ.

చొక్కాతో తుడుచుకుంటోంది లచ్చి — నోట్లోంచి వస్తున్న రక్తాన్ని.

జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటున్నాడు పెళ్ళికొడుకు అలసటతో.

నోట్లోంచి కారుతున్న నెత్తురుని కొంగుతో తుడిచి, చెయ్యి పట్టుకొని గుడిసె కొచ్చింది సత్తి— లచ్చిని తీసుకుని. కుండలోంచి నీళ్ళు తీసి నోరు కడిగింది. చిరుగు చాపేసింది ఆ చీకటి గుడిసెలో లచ్చికి సత్తి.

ఆ అంధకారంలో లచ్చి ఆలోచన వెళ్ళిం దా ట్యూబులైటుపైన. ఒక్కసారి కళ్ళు మూసుకుంది. వూహలో కూడా భరించలేక పోయిం దా చిన్నారి మనస్సు ఆ ట్యూబులైటు వెలుగు

గుడిసె బయట పున్నమి చంద్రుడు మబ్బుల మాటు కెళ్ళాడు. తన వెలుగుని కూడా భరించలేదేమో ఆ చిట్టిదని.

దూరాన పెళ్ళి మేళం వినబడుతోంది సత్తికి.

రెండు చేతుల్తో చెవులుమూసుకుంది సత్తి— అంతకన్నా మరింకేమీ చేయలేక. ●